# అల్లుడు



— శ్రీమతి తాటికోల పద్మావతి

రంగారావుకి పెళ్ళయి నాలుగేళ్ళయింది. "ఏరా ఇంకా పిల్లలు పుట్టలేదు. ఇప్పుడే వద్దనుకొన్నారా ఏమిటి?" సందేహంగానే తల్లి కాంతమ్మ అడగనే అడిగింది.

"అబ్బే అదేం లేదమ్మా! పుడతారులే తొందరేమొచ్చింది?"

కొడుకు సమాధానం ఆమెకి తృప్తి కలగలేదు. "పుడతారులే అని కూర్చుంటే సరిపోతుందా! ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళ్ళి ఇద్దరూ టెస్ట్ చేయించుకోండి" అంది.

"అలాగేలే చూద్దాం" అన్నాడు! భార్య విశాలాక్షి పుట్టింటికి వెళ్ళింది. పండక్కి ఇద్దరూ కలసి వెళ్ళారు. రంగారావు ఉద్యోగరీత్యా సెలవు దొరకదని మర్నాడే వచ్చేశాడు.

పండగయినాక అమ్మాయిని నాలుగు రోజులుంచమన్నారు. అలాగేనని వచ్చాడు రంగారావు.

* * *

ఆదివారం విశాలాక్షిని తండ్రి వెంటబెట్టుకొని వచ్చాడు. "రండి మామయ్యగారూ! కులాసానా" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

"నేను కులాసాగానే ఉన్నానయ్యా! మీ ఆవిడనే అడుగు శుభవార్త చెబుతుంది" అన్నారు.

గదిలో చీర మార్చుకుంటున్న విశాలాక్షిని చూసి "ఏయ్ దొంగా! ఏమిటా శుభవార్త తొందరగా చెప్పవూ" అంటూ దగ్గరకొచ్చి, ఇన్నాళ్ళ విరహవేదన భరించలేక బాహుబంధాలలో బిగించి ఉక్కిరిబిక్కిరి

చేశాడు!

విశాలాక్షి నవ్వుతూ "మీరు త్వరలో తండ్రికాబోతున్నారు"అని చెప్పింది.

"అమ్మయ్య రక్షించావు! నిన్ననే ఈ విషయం గురించి మా అమ్మ నన్ను అడిగింది. నువ్వు రాగానే డాక్టర్ దగ్గరకు వెళ్ళి టెస్ట్ చేయించుదామను కొంటున్నాను." అంటూ ఆనందంతో కేక పెట్టాడు.

కాంతమ్మ ముఖం చాటంతయింది కోడలు నెల తప్పినందుకు.

✻ ✻ ✻

పిల్లలు పిల్లలు అని కలవరించినందుకు విశాలాక్షి వరుసగా ముగ్గురు ఆడపిల్లల్ని కన్నది. మగపిల్లవాడు పుట్టలేదని మనసులో బెంగపెట్టు కొన్నా, ఏంచేస్తాం మన అదృష్టం అనుకొన్నారు.

కాంతమ్మ మాత్రం కొడుకుని కనలేదని కోడల్ని సాధిస్తూనే ఉంది.

✻ ✻ ✻

రంగారావుగారు ముగ్గురు ఆడపిల్లల్ని చదివించి పెద్ద చేశారు.

పెద్దమ్మాయి శారద డిగ్రీ చదవగానే సంబంధం కుదిరించారు పెళ్ళిళ్ళ పేరయ్యగారు.

సర్వీసులో ఉండగానే ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి బాధ్యత నెరవేర్చుకోవాలనుకొన్నారు. విశాలాక్షి భర్త మాటకు ఎదురుచెప్పదు. కాంతమ్మ పెద్ద వయసుకావటంతో మంచంలో పడి కోడలి చేత చేయించుకోకుండానే నాలుగు రోజుల జ్వరంతో కన్నుమూసింది.

అల్లుడు అడిగినంత కట్నం ఇచ్చి, లాంఛనాలతో, ఉన్న దాంట్లోనే ఏ లోటూ లేకుండా పెళ్ళి చేసి శారదను అత్తవారింటికి పంపించారు.

ఇంట్లో శారద కనిపించకపోయేసరికి ఇల్లు సందడిలేదని విశాలాక్షి బాధపడేది.

సాయంత్రం ఆఫీసునుంచి రాగానే కాఫీ త్రాగి పడక కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నారు రంగారావు.

విశాలాక్షి చాటలో బియ్యం పోసుకొని ఏరుతూ ఎదురుగానే కూర్చుంది. కళ్యాణి, శిరీష గదిలో కూర్చుని చదువుకొంటున్నారు. పెళ్ళికెదిగిన ఆడపిల్లలు ఇంట్లో ఉన్నారంటే పెద్ద భారంగా కనిపిస్తారు.

ఆడపిల్లకు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపితే చాలనుకొనే రోజులు కావు. పెళ్ళి కాకముందు కాలేదని దిగులు. పెళ్ళయినాక పిల్ల అత్తవారింట్లో ఎన్ని కష్టాలు పడుతున్నదోనని బెంగ.

శారద అత్తవారింట్లో ఎలా ఉందో ఏమో. అందరిలోనూ కలసిపోయి ఉంటే ఫరవాలేదు. సంవత్సరం లోగా పండక్కి కూతురు అల్లుడిని పిలిచారు. అల్లుడు సుధాకర్ చాలా మంచివాడు. పండక్కి అవీ ఇవీ కావాలని అడగడు. మొదటి సంవత్సరం కదా అని ఇద్దరికీ బట్టలు పెట్టి మరో వెయ్యి రూపాయలు ఇచ్చారు.

రంగారావుగార్కి ఉండటానికి ఒక పెంకుటిల్లు ఉంది. తాతలనాటి రెండెకరాల పొలం. అది సరిగా పండదు. కౌలుకు ఇచ్చేశారు. ఏదైనా పంట వేసినపుడు కాస్తో కూస్తో తెచ్చిస్తుంటారు రైతులు.

✻ ✻ ✻

మరో రెండేళ్ళలో కల్యాణికి కూడా మంచి సంబంధం చేశారు. ఆమె భర్త జగదీశ్! కలక్టరాఫీసులో ఉద్యోగం. పిల్లలకి కాస్త మంచి సంబంధాలు చేస్తే వెనుకాముందూ చూడక్కరలేదు.

జోరున వాన కురుస్తుంటే తడుసుకొంటూ వచ్చిన భర్తను చూసి, "ఇంత వానలో తడుసుకొంటూ రాకపోతే ఏం పోయింది. ఎక్కడైనా ఆగి నిదానంగా రావచ్చుగదా" అంది విశాలాక్షి.

"ఇంకా కుంభవృష్టి సాగితే రావటం కష్టం. ఆ తువ్వాలు ఇలా ఇవ్వు. తల తుడుచుకొంటా"నంటూ తువాలు తీసుకొన్నారు.

విశాలాక్షి వేడి వేడిగా కప్పుతో టీ తెచ్చింది. ఈలోగా బట్టలు మార్చుకొని టీ తాగుతూ కూర్చున్నారు.

ఇపుడుంటున్న పెంకుటిల్లు పాతది కావటంతో అక్కడక్కడా పెంకులు పగిలిపోయినాయి. ఇంట్లో ఒక్కోచోట నీళ్ళు ధారగా కురుస్తుంటే వాటి క్రింద గిన్నెలు పెట్టింది.

ఈ సంవత్సరమన్నా ఇల్లు కప్పిద్దామంటే డబ్బు మిగలటం లేదు. పెళ్ళిళ్ళు, పురుళ్ళు పుణ్యాలకే సరిపోతున్నది. పొలం తాలూకు ఏమైనా డబ్బు వస్తే వాటితోనన్నా ఇల్లు కప్పించాలను కొన్నారు.

"సంక్రాంతి పండుగ దగ్గరకొస్తున్నది. రెండో అమ్మాయినీ, అల్లుడినీ పండక్కి రమ్మని ఉత్తరం వ్రాశారా?" విశాలాక్షి భర్తని అడిగింది.

"రెండో అమ్మాయిని పిలిచి, పెద్దమ్మాయిని పిలవద్దంటావా?. 'చూశావా నన్ను పిలవలేద'ని పెద్దమ్మాయి బాధపడుతుంది కదా! అందుకే ఇద్దరినీ పిలవాలనుకొంటున్నాను."

"ఇద్దరినీ ఒకేసారి పిలిస్తే ఖర్చులు భరించగలరా?. ఇద్దరికీ బట్టలుకొనాలి, కళ్యాణికి కొత్తగా పెళ్ళయింది. అమ్మాయి, అల్లుడు రావటం ఇదే మొదటిసారి. వాళ్ళకి బట్టలు పెడితే సరిపోతుందంటారా?"


"బట్టలు కాకపోతే స్కూటర్లు, టీ.విలు కొనివ్వమంటావా ఏమిటి? మనకి చేతనైంది మనం పెడతాం. లేకపోతే డబ్బు చేతిలో పెడతాను వాళ్ళనే కొనుక్కోమని. అంతకు మించి నాకు శక్తి లేదు" అన్నారు రంగారావు.

"ఏమో మీ ఇష్టం ఏం చేసుకొంటారో, ముందు ఉత్తరం రాసి పడేయండి." చాటలో బియ్యం గిన్నెలో పోసుకొని లోపలికి వెళ్ళింది వంట పనిలో నిమగ్నమైంది.

శారద, కళ్యాణి డిగ్రీ వరకు చదవగానే పెళ్ళిళ్ళు చేశారు. శిరీష మాత్రం బి.ఇడి. పూర్తి చేసింది. అనుకోకుండా ఉన్న ఊర్లోనే టీచర్ పోస్టు వచ్చింది.

వర్షం పడుతుంటే స్కూల్లోనే ఆగిపోయింది. పూర్తిగా తగ్గినాక ఇంటికి వచ్చింది. విశాలాక్షి కూతురికి కూడా వేడివేడిగా కాఫీ కలిపి ఇచ్చింది. తల్లి వంట పనిలో ఉంటే కత్తిపీట తీసుకొని అక్కడే కూర్చుని కూర తరగటం మొదలుపెట్టింది. శిరీష ఆదర్శభావాలు గల యువతి. కట్నం లేకుండా పెళ్ళి చేసుకొంటానన్నవాళ్ళు దొరికితేనే పెళ్ళి చేసుకుంటానంటుంది.

"ఉద్యోగం చేసి జీతం తెచ్చి ఇస్తున్నా కట్నం లేకుండా ఎవరు చేసుకొంటారు. అలాగే కూర్చుంటే ఈ జన్మలో పెళ్ళి కాదు. జీవితాంతం ఇలాగే





## ప్రేమ గుడ్డిది!

*"ధర్మేంద్ర అంకుల్ సినిమాలు చూడ్లేదుగాని చాలా సీరియస్‌గా వుండేవారట. అదే సీరియస్‌నెస్‌ని 'సన్నీ'లో చూస్తున్నాను. చిత్రం ఏమిటంటే...రొమేన్స్ చేయడంలోనూ సన్నీ సీరియస్‌గానే చేస్తాడు. అపుడపుడు ఏడిపిస్తుంటాడు కూడా. బాబూ నీ రొమేన్సు చూడలేకపోతున్నా" అని అంటోంది బాలీవుడ్ హీరోయిన్ ప్రీతిజింతా! (అందుకేనేమో యిద్దరూ నల్ల కళ్ళద్దాలు ఎంచుకున్నారు)*

ఉండిపోవలసి వస్తుందం"టుంది విశాలాక్షి.

"శారదకు, కళ్యాణికి కట్నం ఇవ్వకుండానే పెళ్ళిళ్ళు జరిగాయా! ఈ రోజుల్లో కట్నం లేకుండా ఎవరు చేసుకొంటారు? నీకు ఉన్న దాంట్లోనే ఇచ్చి చెయ్యాలి, నాన్నగారు రిటైరవుతారు, ఆ వచ్చిన డబ్బుతోనే పెళ్ళి చెయ్యాలి."

"వచ్చిన డబ్బంతా నా పెళ్ళికి ఖర్చుపెడితే మీరెలా బ్రతుకుతారమ్మా? మీ జీవితాలు గడిచేదెలా? లేవలేని పరిస్థితిలో మిమ్మల్నెవరు చూస్తారు?"

"కొడుకులెటూ లేరు. మీరు ముగ్గురూ ఆడపిల్లలు. మీరే చూడాలి మమ్మల్ని. కొడుకులు లేకపోతే కూతుళ్ళకి చూసే బాధ్యత ఎందుకుండదు?"

"తప్పకుండా చూస్తాం!" అంటూ హామినిచ్చింది.

"మీ నాన్న గారికి ఇంకా నాలుగు సంవత్సరాల సర్వీసు వుంది. రిటైరయినాక వచ్చే పెన్షన్‌తో గడుపుకొంటాం. కూతుళ్ళు ఒప్పుకొన్నా, అల్లుళ్ళు పరాయివాళ్ళు, వాళ్ళు ఒప్పుకోవాలిగదా."

"అక్కలిద్దరూ చూడకపోయినా నాకు ఉద్యోగం ఉంది కదా! నేను మిమ్మల్ని తప్పకుండా చూస్తాను"అంది శిరీష.

రంగారావుగారు కూతుళ్ళిద్దరినీ పండక్కి రమ్మని ఉత్తరాలు వ్రాశారు. రేపు భోగి పండుగ అనగా ముందురోజు కళ్యాణి, జగదీశ్ వచ్చారు.

"ఏమ్మా కులాసానా! అల్లుడుగారూ! బాగున్నారా" అంటూ పలకరించారు. శిరీష అక్కా బావలతో సరదాగా మాట్లాడింది. మాటల్లో "శారద అక్కరాదా" అని అడిగింది కళ్యాణి.

"బావగారికి సెలవు లేదట. పండుగరోజు వస్తానన్నారు."

రాత్రి భోజనాలైనాయి. ముందు గదిలో విశాలాక్షి, శిరీష, రంగారావులు మంచాలు వేసుకొని పడుకొన్నారు. లోపల గదిలో కళ్యాణి, జగదీశ్ పడుకొన్నారు. రాత్రి చాలా పొద్దు పోయేవరకు మాట్లాడుకొంటున్నారు.

"మీ నాన్న పండక్కి బట్టలతో సరిపెడతాడేమో అదేం కుదరదని చెప్పు."

బట్టలు చాలా చవగ్గానే దొరుకుతున్నాయి. ఆఫీసులో నలుగురికీ తెలిస్తే నా పరువుపోతుంది. పండక్కి మామగారింటికి వెళ్ళావు ఏమిచ్చారని మా ఫ్రెండ్సంతా అడుగుతారు. ఏమీ ఇవ్వలేదంటే నన్ను ఎగతాళిగా చూస్తారు."

"అందుకని ఏం చేయమంటారు?" కళ్యాణి భర్తను చూస్తూ అడిగింది.

"ఓసి పిచ్చిదానా! నీకామాత్రం తెలియదా?. స్కూటరు కావాలని అడుగు."

"అమ్మో! స్కూటరా" గుండెలమీద చెయ్యి వేసుకొంది. జగదీశ్ ఆ చేతిని తన చేతిలోకి తీసుకొని మృదువుగా చెంపలను నిమురుకొంటూ, "సాయంత్రం నేను ఆఫీసునుంచి ఇంటికి రాగానే, ఇద్దరం కలసి ఝుాంమ్మని తిరిగివద్దాం."

"అంత డబ్బు మా నాన్న దగ్గర లేదండి. ఆయన మాత్రం ఎక్కడినుండి తెచ్చిస్తారు?"

"మీ నాన్న దగ్గర ఉందో లేదో నీకేం తెలుసు? ఉద్యోగం చేసి సంపాదిస్తున్నాడు కదా! కూతురికోసం ఆమాత్రం కొనివ్వలేడా ఏమిటి? రేపు రిటైరయితే బోలెడంత డబ్బు వస్తుంది."

"శిరీష పెళ్ళి ఎవరు చేస్తారనుకొన్నారు?"

"శిరీషకేం ఉద్యోగం చేసి సంపాదించుకొంటున్నది. ఆ జీతం దాచినా పెళ్ళప్పటికి బోలెడవుతుంది. మనం ఇపుడే కొనిపించుకోవాలి! ఆ తర్వాత ఉన్నదంతా ఖర్చయితే మనకేమీ పెట్టరు."

భర్త మాటలు వినకుండానే కళ్యాణి నిద్రలోకి జారుకొంది.

తెల్లవారింది. చీకటిలోనే అక్కడక్కడా భోగిమంటలు వేశారు. విశాలాక్షి త్వరగా లేచి నీళ్ళ కాగు వేసింది. అంతా తలంటు స్నానాలు చేశారు.

శిరీష కాఫీ గ్లాసు తీసుకొని వెళ్ళి గదిలో ఉన్న బావగార్కి అందించింది.

అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ కలిసి టిఫిన్ చేస్తున్నారు. విశాలాక్షి మాత్రం పండక్కి పిండివంటల తయారీలో ఉంది.

ఉదయం పది గంటలకల్లా శారద, బర్తా ఇద్దరూ ఆటోలో దిగారు. "మీరు రాకపోతే నాకు బోర్ కొడుతున్నది, వచ్చినందుకు సంతోషం" అంటూ జగదీశ్ సుధాకర్‌ని పలుకరించాడు. అంతా ఒక్కచోట చేరేసరికి పండుగ సంబరమంతా అక్కడే ఉన్నట్లనిపించింది.

సాయంత్రం ఆడవాళ్ళంతా కలిసి భోగిపళ్ళ పేరంటానికి వెళ్ళారు. "రండి మనమూ అలా బయటికి వెళ్దాం. ఇంట్లో ఉండి ఏం చేస్తామంటూ" సుధాకర్, జగదీశ్ బయటికి వెళ్లారు.

పేరంటం త్వరగా అయిపోవటంతో ఇంటికి వచ్చారు. అక్కచెల్లెళ్ళు ముగ్గురూ గదిలో కూర్చుని మాట్లాడుకొంటున్నారు. విశాలాక్షి వంట ప్రయత్నంలో ఉంది.

"అక్కా! ఈ చీరలు ఎలా ఉన్నాయి? చూడమంటూ ప్యాకెట్లు తెచ్చి చూపించింది. శారద, కళ్యాణి చెరో ప్యాకెట్టులోనుంచి చీరలు బయటికి తీశారు. అవి కొత్తగా వస్తున్న కళాంజలి శారీస్. ఒక్కొక్కటి ఐదువందల దాకా ఉంటుంది. చీరలు చాలా బాగున్నాయంది శారద.

కళ్యాణి ఏం మాట్లాడలేదు. "అక్కా నీకు నచ్చలేదా?" అంటూ శిరీష అడిగింది.

కళ్యాణి మాట్లాడకుండా మౌనంగా ఉంది. శారద శిరీషవైపు చూసింది. ఏమిటన్నట్లు? ఏమో తెలియదంది.

"ఏం చేస్తున్నారు? మీరిక్కడ భోజనాలకేర్పాట్లు చేయడంటూ" చెప్పటానికి వచ్చింది విశాలాక్షి.

"అమ్మా చిన్నక్కకి చీరనచ్చలేదు కాబోలు. రేపు వెళ్ళి మార్చుకొస్తా"నంది.

కళ్యాణి గాభరాగా "వద్దు! వద్దు! మార్చొద్దు. బాగుంది. ఇదే ఉంచండి!"

పైకి చెప్పలేక మనసులోనే దాచుకొన్నా ముఖంలో విచారం కనిపిస్తునే ఉంది. "అక్కా చెప్పు. ఎందుకిలా ఉన్నావంటూ" బలవంతం చేసింది శిరీష.

"పండక్కి మీ బావగార్కి స్కూటరు కావాలిట. బట్టలు పెడితే తీసుకోనన్నారు. ఈ విషయం మీతో చెప్పమని రాత్రి నాతో గట్టిగా చెప్పారు."

"స్కూటరా" విశాలాక్షి ఆశ్చర్యంగా నోరు తెరిచింది. "ఇంకా పెళ్ళికి చేసిన అప్పులు తీరనే లేదు. ఇపుడు స్కూటరు కావాలంటే ఎక్కడి నుంచి తెచ్చిస్తాం?" శారద ఏం కలుగచేసుకోలేదు. నాకెందుకులే అని ఊరుకొంది.

ముందు వరండాలో కూర్చున్న భర్త దగ్గరకొచ్చి ఈ విషయం చెప్పింది విశాలాక్షి. ఆయన కుర్చీలోంచి లేచి కళ్యాణి దగ్గరకు వెళ్ళారు.

"ఏమ్మా! అల్లుడు స్కూటరు కావాలన్నారుట. పండక్కి పిలిచి ఏదో మా శక్తి కొద్దీ పెట్టాలనుకొన్నాం. స్కూటరంటే అంత డబ్బు ఎక్కడనుంచి తేగలను? పెళ్ళికి తెచ్చిన లోను ఇంకా తీరలేదు. నెలనెలా వచ్చే జీతం

తగ్గిపోతున్నది. శిరీష పెళ్ళి కూడా చేస్తే, ఏదైనా మిగిలితే చివరికి ఉన్నదేదో మీకే ఇస్తాను గదా! అల్లుడుగారికి ఎలాగో నచ్చ చెప్పు."

బయటికి వెళ్ళిన అల్లుడు రావటంతో ఆ టాపిక్ అంతటితో ముగించేశారు. భోజనాలు చేసి అంతా పడుకొన్నారు.

"నేనడిగింది చెప్పావా మీవాళ్ళకి?" జగదీశ్ కళ్యాణిని అడిగాడు.

"మీరు అడగమన్నట్లు అడిగాను. ఇప్పుడు మావల్ల కాదన్నారు. శిరీష పెళ్ళి కూడా చేశాక ఏదైనా మిగిలితే అపుడు చూద్దామన్నారు."

"శిరీష పెళ్ళి దాకా ఆగమంటారా! అపుడు ఉన్నదంతా ఖర్చుపెట్టి చివరికి ఏమీ మిగల్లేదని ఉత్త చేతులు చూపిస్తారు. మనం ముందే రాబట్టుకోవాలి. శిరీష ఉద్యోగం చేసి సంపాదించుకొంటున్నది. నీ ముఖానికి ఉద్యోగమూ సంపాదనా, ఏదీలేదు. స్కూటరుకి డబ్బు ఇస్తేనే నువ్వు నాతోపాటు వస్తావు. లేకపోతే శాశ్వతంగా పుట్టింట్లోనే ఉండు."

కళ్యాణి భర్త మాటలకు ఏడుస్తున్నది. మెలకువతో ఉన్న శిరీషకు గదిలోంచి వాళ్ళ మాటలు వినిపించినాయి. స్కూటరు కోసం బావ అక్కయ్యని ఇక్కడే వదిలేసి వెళ్తానంటున్నాడు. చదువుకొని ఉద్యోగం చేసి తనూ సంపాదించుకొంటున్నాడు. తను ఆ మాత్రం కొనుక్కోలేడా. ఒకరు ఉచితంగా ఇవ్వాలని ఆశపడటం మంచిది కాదు. ఈ విషయం నాన్నగార్కి తెలిస్తే చాలా బాధపడతారు. కన్న కూతురు పుట్టింట్లో ఉంటే ఏ తండ్రీ చూస్తూ భరించగలడు. తెల్లవారాక ఏదైనా పరిష్కారం ఆలోచించాలనుకొంది.

తెల్లవారింది. జగదీశ్ బ్యాగ్‌ను సర్దుకొని బయలుదేరాడు. అదేమిటండీ పండక్కి వచ్చినవాళ్ళు ఉండకుండా వెళ్ళటం బాగుండదు. ఈ రెండురోజులు సెలవుపెట్టారు కదా పండగైనాక వెళ్ళమని అంతా బ్రతిమిలాడారు. అయినా ఎవరిమాటా లెక్క చేయకుండ జగదీశ్ వెళ్ళిపోయాడు.

శిరీష తండ్రిని పక్కకి పిలచి రాత్రి విన్నదంతా చెప్పింది. పండక్కి వచ్చిన కూతురు సంతోషంగా ఉంటుందనుకొంటే అల్లుడు చేసిన పనికి అంతా బాధపడ్డారు.

"నాన్నా! మీరేం బాధపడకండి. బ్యాంకులో నేను దాచుకున్న డబ్బులు పదివేల దాకా ఉన్నాయి. కావాలంటే నా మెడలో గొలుసు తీసి ఇస్తాను. అది కూడా అమ్మేసి వచ్చింది బావగారికి ఇవ్వండి. అక్క కాపురం కుదుటపడుతుంది"అంది శిరీష తండ్రికి ధైర్యం చెప్తూ.

"వద్దు శిరీషా! నా కోసం నీ డబ్బు, గొలుసు ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. నా ముఖాన ఎలా రాసిపెట్టి ఉంటే అలాగే జరుగుతుంది. ఇవాళ స్కూటరన్నారు, రేపు మరొకటి అడుగుతారు అడిగినప్పుడల్లా ఎక్కడి నుండి తెస్తారు? ఆయనకి భార్య కావాలనుకొని వచ్చినపుడే తీసుకెళ్తారు." కళ్ళనీళ్ళు పెట్టుకొన్న కూతురుని ఓదార్చారు. పండగపూట ఆడపిల్ల కంట తడిపెట్టకూడదు. ఎలాగైనా నిన్ను అత్తవారింటికి పంపే ప్రయత్నం చేస్తాం అన్నారు.

జగదీశ్ ఇలా చేస్తాడనుకోలేదు. సుధాకర్, శారద కూడా చాలా బాధపడ్డారు. పండుగ సంబరం ఎవరి ముఖానా కనిపించటం లేదు. మనం ఇక్కడే ఉండి వాళ్ళని బాధపెట్టినవాళ్ళమవుతాం. వెళ్దామా అన్నాడు శారదతో. పండుగరోజు వెళితే బాగుండదు. రేపు ఒక్కరోజు ఉండి వెళదాం. ఇపుడే వెళితే మనం కూడా అలిగి వెళ్ళి పోయామనుకొంటారు. ఆడపిల్లలకి బొట్టు పెట్టి చీరలు పెట్టింది విశాలాక్షి. కొత్తచీర కట్టుకొని తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించారు. సుధాకర్‌కి కూడా బట్టలు పెడుతుంటే వద్దంటూ తీసుకోలేదు. "ఏదో మాకు తోచింది పెట్టాం కాదనకండి"అంటూ రంగారావుగారు బలవంతం చేయడంతో తీసుకోక తప్పలేదు. పండుగ మర్నాడు ఇద్దరూ వెళ్ళిపోయారు.

జగదీశ్ ఇంటికి వెళ్ళగానే "పండగరోజే వచ్చావేమిటని" తల్లి అడిగింది.

"ఇంకా అక్కడ ఏ ముఖం పెట్టుకొని ఉంటాను. స్కూటరుకి డబ్బు ఇపుడు ఇవ్వరుట. ఎపుడో శిరీష పెళ్ళయినాక మిగిలితే ముగ్గురు కూతుళ్ళకు ఇస్తారుట."

"అప్పటిదాకా ఆగితే ఇస్తారని గ్యారంటీ ఏమిటి? మొదటిసారి పండక్కి ఆమాత్రం ఇవ్వలేరా! దాన్ని అక్కడే వదిలేసి వచ్చావా? మంచి పనిచేశావు. ఆ డబ్బు తెచ్చేవరకు వాళ్ళ గుమ్మం తొక్కకు" కొడుక్కి హితభోదలు చేసింది. తల్లిమాటలు మరింత చెవి కెక్కాయి.

వారం రోజులు కళ్యాణి ఇంట్లో లేకపోయేసరికి భార్య లోటేమిటో తెలిసివచ్చింది. అల్లుడుగా తన బెట్టు వదులుకోకూడదనుకున్నాడు.

ఉన్నట్లుండి ఒకరోజు సాయంత్రం జగదీశ్ చెల్లెలు ఊరినుంచి వచ్చింది. ఇంత హఠాత్తుగా ఎందుకొచ్చిందో జగదీశ్‌కి అర్థం కాలేదు.

ఇద్దరు పిల్లల్ని తీసుకొని హైదరాబాదు నుంచి ఒక్కతే వచ్చింది.

"ఏమ్మా సుజాతా! అల్లుడుగారు రాలేదా? ఒక్కదానివే వచ్చావు" తల్లి ఆప్యాయంగా అడిగేసరికి అమ్మా అంటూ తల్లి రెండు చేతుల్లో వాలిపోయి భోరుమంది.

కూతురు ఏడుస్తుంటే కంగారుగా, "ఏమైందమ్మా, ఏం జరిగింది? అల్లుడుగారు ఏమైనా అన్నారా? చెప్పమ్మా చెప్పు!" బలవంతం చేసింది.

అపుడే ఆఫీసునుంచి వచ్చిన జగదీశ్ చెల్లెలు కంటతడిబెట్టడం చూశాడు.

"అమ్మా! మీ అల్లుడు చేసే బిజినెస్‌లో లక్షరూపాయలు లాస్ వచ్చిందట. కంపెనీలో అందరూ ఆయన వల్లే నష్టం వచ్చిందని ఆ డబ్బు వెంటనే కట్టమని వత్తిడి చేస్తున్నారు. లేకపోతే పార్టనర్‌షిప్ తొలగించేస్తారుట. ఉన్న ఆధారం కూడా పోతే మేమెలా బ్రతకాలి? పిల్లలూ, నేనూ ఏ



## తప్పవు తల్లీ!

*అంత్రామాలి గడగడా మాట్లాడేస్తుంది. "సినిమాల్లో పైకి రావాలంటే ఎక్స్‌పోజింగ్ తప్పదని ఒక్కపక్క చెబుతూనే కెమెరా ముందు ఎక్స్‌పోజింగ్ ప్రదర్శిస్తే...తెర వెనుక మూతులు కొరుక్కుంటారెందుకు? ఇంతకీ ఎక్స్‌పోజింగ్ చెయ్యడం ఇష్టమా! కాదా? అయినా ఎక్స్‌పోజింగ్ అరవైయేళ్ళకి చెయ్యలేరుగా" అంటోంది. (అలాగని అన్నీ విప్పుకు తిరగమని అందరూ చెప్పలేరుగా)*

గంగలోనో దూకి చావాలి" నోటికి చీర కొంగు అడ్డుపెట్టుకొని ఏడుస్తున్న సుజాతను చూడగానే జగదీశ్ గుండె బరువెక్కింది.

"అన్నయ్యనడిగి లక్షరూపాయలు తెమ్మని పంపించారు. అంత డబ్బు దొరకదని చెప్పినా నా మాట వినలేదు. అసలే పరిస్థితులు బాగాలేక చిక్కుల్లో ఇరుక్కొన్నారు. ఆ బాధతో కోపమంతా మామీద చూపించి డబ్బు తెస్తేనే గుమ్మం తొక్కు, లేకపోతే నువ్వు, నీ పిల్లలు అక్కడే ఉండమన్నారు. అమ్మా నాకు చాలా భయంగా ఉంది."

"ఏమిటీ లక్షరూపాయలా! ఇక్కడేమన్నా చెట్లకు కాస్తున్నాయనుకొన్నారా! నేనెక్కడినుంచి తెచ్చి ఇస్తాను. అయినా నాకేం పని ఇవ్వటానికి."

"అదేమిటిరా అలా అంటావు! ఇంటి కొడుకుగా నీకా బాధ్యత లేదా? అది నీ చెల్లెలు! దాని సంసారం నిలబెట్టే బాధ్యత నీకుంది! మీ నాన్న బ్రతికుంటే అన్నీ ఆయనే చూసుకొనేవారు. తండ్రి లేడు కాబట్టే నిన్ను ఆశ్రయించింది. పెళ్ళయి, ఇద్దరు పిల్లల

# 2001 ప్రపంచ సుందరిగా అగ్బానీ దరెగో



ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీలలో 2001 ప్రపంచ సుందరిగా అగ్బానీ దరెగో ఎంపికైయ్యింది. సన్ సిటీలో జరిగిన 51వ ప్రపంచ సుందరి పోటీలలో నైజీరియాకు చెందిన 18ఏళ్ళ నల్లజాతి యువతి ఎన్నికవడం విశేషం. ఇంతవరకూ ఏ నల్లజాతి యువతికి ఈ కిరీటం దక్కలేదు. నైజీరియా యువతి ప్రపంచసుందరిగా ఎంపిక అవడం ఇదే మొదటిసారి. కంప్యూటర్‌సైన్స్ చదువుతున్న అగ్బానీ ఈ కిరీటం గెలుచుకున్న తొలి ఆఫ్రికన్ యువతిగా కూడా చరిత్ర సృష్టించింది. అగ్బానీ దరెగో కంప్యూటర్ సైంటిస్ట్‌గానూ, సూపర్‌మోడల్‌గా రాణించాలని కోరుకుంటోంది.

తల్లిని మనింట్లో ఎన్నాళ్ళు ఉంచుకోగలం. ఆడపిల్ల పుట్టింట్లో ఉండటం మంచిది కాదు."

జగదీశ్ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కనీసం కాఫీ కూడా ఇచ్చేవాళ్ళు కనిపించటం లేదు. ఉదయం ఆఫీసుకి వెళ్ళేటపుడు వంట కూడా చేయకపోవటంతో హోటల్‌లోనే సరిపెట్టుకొంటున్నాడు. తిన్నావా, లేదా? అని అడిగే దిక్కు లేదు.

ఎలాగైనా డబ్బు సర్దుబాటు చేయమని అమ్మ గొడవ పెడుతున్నది. డబ్బివ్వకపోతే చెల్లెలు శాశ్వతంగా ఇంట్లో పడి ఉంటుంది. ఆ ఇద్దరు పిల్లలు రాక్షసుల్లాగా గోల చేసి ఇల్లంతా నానా రభస చేస్తున్నారు. ఛీ ఛీ ఇంట్లో ఒక్క నిమిషం ఉండాలంటే మనశ్శాంతి లేకుండా పోతున్నది. లక్ష రూపాయలు ఎక్కడినుంచి తేవటం?

బావగారికైనా బుద్ధి ఉండక్కరలేదా! ఎక్కడ నుంచి తెచ్చిస్తాననుకొన్నాడు. ఒకర్ని అడగటానికి కూడా సంస్కారం ఉండాలి.

'నేనేనా సంస్కరం గురించి మాట్లాడుతున్నది? నేను చేసిన నిర్వాకం ఏమిటి? స్కూటరు కొనుక్కోవటానికి డబ్బు లేదని కళ్యాణిని పుట్టింట్లో వదిలేసి వచ్చాను. వాళ్ళు ఎంతగా బాధపడుతున్నారో కళ్యాణి నాకోసం ఎంతగా ఎదురుచూస్తున్నదో' అని జగదీశ్ మనసులోనే బాధ పడ్డాడు. వెంటనే అతను స్థిర నిర్ణయం తీసుకొని అత్తారింటికి బయలుదేరాడు.

* * *

చీకటిగదిలో ఒంటరిగా కూర్చున్న కళ్యాణిని పిలిచారు రంగారావుగారు. "అమ్మా కళ్యాణి బట్టలు అవి సర్దుకొన్నావా. డబ్బు సిద్ధం చేశాను. తెల్లవారగానే నిన్ను నీ భర్త దగ్గరకు తీసుకెళతాను. బాధపడకమ్మా. ఆడపిల్లలు సుఖంగా ఉండాలని కోరుకొంటాం. శిరీష తను దాచుకొన్న డబ్బు ఇచ్చింది. మిగతాది మరోచోట అప్పు తెచ్చాను."

"ఆ అప్పు ఎలా తీరుస్తావు నాన్నా? నా కోసం మీరిలా కష్టపడటం నాకిష్టం లేదు" అంది కళ్యాణి రోదిస్తూ.

"మా బాధలేవో మేంపడతాం! నాకింకా ఓపిక ఉంది. మరో నాలుగేళ్ళు సర్వీసుంది"అంటూ ఓదార్చారు. ఇంతలో శిరీష కూడా అక్కడికి వచ్చింది. "అక్కా నాన్నకు మగపిల్లలు ఎవరూలేరు. మన ముగ్గురం ఆడపిల్లలం. కొడుకులైనా, కూతుళ్ళమైనా మనమే! వాళ్ళని చూసే బాధ్యత కూడా మనమీద ఉంటుంది."

గడపలోకి అడుగుపెట్టిన జగదీశ్‌కి శిరీష మాటలు బాగా నచ్చాయి. "శభాష్ మరదలా, చాలా బాగా చెప్పావు. ఉన్నదంతా కూతుళ్ళు, అల్లుళ్ళు కాజేస్తే, వార్ధక్యంలో వాళ్ళని ఆదుకొనేవారెవరు?" అంటూ "కళ్యాణి పద బయలుదేరు!" అన్నాడు. భర్త వంక ఆశ్చర్యంగా చూసింది కళ్యాణి.

"ఏమిటలా చూస్తున్నావు? నేను స్కూటరు డబ్బు కోసం రాలేదు. నిన్ను తీసుకెళటానికి వచ్చాను. మావయ్యగారూ! నన్ను క్షమించండి. మిమ్మల్ని చాలా బాధపెట్టాను."

"నేనే రేపు ఉదయం అమ్మాయిని తీసుకొద్దామనుకొంటున్నాను. డబ్బు కూడ తెచ్చి సిద్ధం చేశానన్నారు" రంగారావుగారు.

"ఆ డబ్బుని శిరీష పెళ్ళికి కట్నం క్రింద ఖర్చు పెట్టండి మావయ్యగారు. కొడుకులు లేరని మీరేం దిగులుపడకండి. మిమ్మల్ని చూసేందుకు మేమున్నాం!"

ఎంత చెప్పినా వినిపించుకోకుండా ఆ రాత్రికే కళ్యాణిని తీసుకెళ్ళాడు జగదీశ్.

భార్య సన్నిహిత్యంలో ఇన్నాళ్ళు ఎడబాటు విరహాన్ని మరచిపోయి ప్రేమగా లాలనగా అక్కున చేర్చుకొన్నాడు. సుజాత పిల్లలిద్దరినీ తీసుకొని మర్నాడే రైలెక్కింది. అది శిరీష ద్వారా వాళ్ళాడిన నాటకమని తెలియదు జగదీశ్‌కి. సుజాత భర్తకి శిరీష అభినందనలు తెలియచేసింది. కళ్యాణి కాపురం కుదుటపడినందుకు ఒక ఆడపిల్లగా తన బాధ్యతగా నెరవేర్చినందుకు సుజాత మనసు కుదుటపడింది. ❀



బాలల దినోత్సవ సందర్భంగా జనని ఆధ్వర్యంలో చెన్నయ్‌లో జరిగిన వ్యాసరచన, తదితర పోటీల్లో విజేతలైన తెలుగువిద్యార్థులు, సంస్థ ప్రధానకార్యదర్శి శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, శ్రీ యస్.వి. గోపాల్, శ్రీమతి నిర్మలా పళనివేల్, గోసాల కొండయ్యగార్లని చిత్రంలో చూడవచ్చు.